ప్రజాశక్తి

Vol. 5, no. 24

(Dec. 13, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 5, no. 24

(Dec. 13, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

Regd. No. M. 4486 0-2-0

ప్రజాశక్తి

సంపుటి 5 బుధవారం 13-12-44 సంచిక 24

"ప్రతి రైతుసంఘసభ్యుడు కాంగ్రెసుసభ్యుడుగా వుండాలనడంతప్పు"

— నెహ్రూ

ఆంధ్రరాష్ట్రంనుండి టి. విచ్చయ్యశాస్త్రిగారు. బి యస్. రెడ్డిగారు గాంధీజీకి రెండుజాబులను వ్రాశారు. వాటికి జవాబుల నీయమని గాంధీజీ శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారిని కోరగా వారు జవాబుల నిచ్చారు. వాటిలో రైతుసంఘాల నిర్మాణాన్ని గూర్చివ్రాస్తూ ఈవిధంగాచెప్పారు.

"కాంగ్రెసుకు అతిముఖ్యముగా కావలసినది శిక్షణము. కాంగ్రెసు శిక్షణముక్రిందికిని, రాజకీయ నాయకత్వముక్రిందికిని, వచ్చి పనిజేయుటకు ఆంధ్రరాష్ట్ర రైతుసంఘము(పోటీ) సిద్ధముగా వున్నట్లు తెలిపినందున మేము వాటిని కాంగ్రెసుకు అనుబంధముగా చేర్చుకొనదలచినాము....మాకు కావలసినది ఒకటే. ఆంధ్రదేశములోని అన్నివర్గములను ఒకే పార్టీలో, అనగా కాంగ్రెసులో, చేరవలెననీ, ఒకే నాయకత్వముక్రింద, అనగా మహాత్మాగాంధిగారి నాయకత్వముక్రింద ఒకేజండా, అనగా జాతీయ త్రివర్ణ పతాకముక్రిందనే పనిచేయవలెనని మా కోరిక."

1936 లో అఖిలభారత కిసాన్‌సభ ఏర్పడి నప్పుడున్నూ, రైతుపోరాటాలు అన్ని రాష్ట్రాలలోనూ ఈ సంఘ ఆధ్వర్యాన నడుపబడునప్పుడున్నూ, శ్రీ కాళేశ్వరరావు గారు, తదితర మితవాద కాంగ్రెసునాయకులు రైతుసంఘా లుండగూడదని తీవ్రమైన వ్యతిరేకతను చూపారు. ప్రత్యేక రైతుసంఘాల నిర్మాణాన్నిగూర్చి కాంగ్రెసుకు అప్పట్లో అధ్యక్షులగు జవహర్‌లాల్‌నెహ్రూ దీర్ఘమైన ప్రకటనజేస్తూ అందులో ఈ విధంగా తెలియజేశారు.

"రైతుసంఘా లుండగూడదని మనం చెప్పలేము. అట్లు చెప్పుట కాంగ్రెసు యొక్క స్పష్టమైన పాలసీకి విరుద్ధము; సిద్ధాంతరీత్యా అది తప్పు. రైతుసంఘాలు వద్దని తలచినచో, అది దేశంలో సజీవమైవున్న వుద్యమానికి, చైతన్యానికి విరుద్ధము. మరిన్నీ రైతు సంఘాలు కాంగ్రెసులో ఒక భాగంగా వుండాలనీ, ప్రతి రైతుసంఘ సభ్యుడూ కాంగ్రెసు సభ్యుడుగా ఉండాలనీ, చెప్పలేము. అట్లు చెప్పటం తప్పు. కాంగ్రెసులో భాగంగా ఉండాలంటె, ఇక రైతుసంఘా లెందుకు? ఇంతేగాదు అఖిలభారత చరఖాసంఘము, గ్రామ పరిశ్రమల సంఘములకువలె రైతుసంఘములను నిర్మించలేము. వాటికి పెట్టిన హద్దులవలె రైతుసంఘములకు హద్దులు పెట్టినా, ప్రత్యేక రైతుసంఘాల నిర్మాణాన్ని అవి ఆటంకపరచలేవు. అట్లుపెట్టేహద్దులు రైతుసంఘాలను కాంగ్రెసుకు దూరంచేయడానికి, కాంగ్రెసును విరోధభావంతో చూడ్డానికి మాత్రమే వుపయోగపడతాయి." (1937)

మరోచోట ఇట్లా చెప్పారు. "పారిశ్రామిక కార్మికులుగాని, రైతులుగాని, స్వతంత్రంగా సంఘాలను నిర్మించుకోడానికి స్వతస్సిద్ధ మగు హక్కును కల్గివున్నారు. కల్గివుండాలి కూడా. ఇది కాంగ్రెసు పదేపదే అంగీకరించిన ప్రాథమికహక్కు. ఇందులో వాదోపవాదాలకు తావులేదు."

ఎన్నో వాదోపవాదాలు జరిగిన పిమ్మట కాంగ్రెసు హరిపురలో ప్రత్యేక రైతుసంఘాల నిర్మాణాన్ని అంగీకరించింది. కాని తిరిగి ఈ నాడు కొందరు కాంగ్రెసువాదులు పై హక్కును గుర్తించక, కాంగ్రెసుకు శాఖగా రైతుసంఘాన్ని ఏర్పర్చబూనటం చరిత్రను వెనక్కు నడపటం గాదా?

రైతుసంఘాల ప్రత్యేక వ్యక్తిత్వం

రైతుసంఘం రైతుల వర్గసంస్థ. తమకు ఆర్థికంగాను, రాజకీయంగాను కలుగు కష్టములను పోగొట్టుకొనుటకూ, హక్కులను సంపాదించుకొనుటకూ, పోరాడుటకై ఏర్పరచుకొన్న ఆయుధం. మనకు ఎట్టయెదుట సజీవంగా కన్పడే రైతు ఉద్యమాన్ని చూస్తే, రైతుసంఘాల ప్రత్యేక వ్యక్తిత్వం గోచరమౌతుంది. ఎంతో శ్రమతో, ఓర్పుతో, వివిధరాజకీయ దృక్పథాలకు చెందిన రైతు వుద్యమాభిమానులచే ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం నిర్మింపబడింది. 1936 లో అఖిలభారత కిసాన్ సభకు అనుబంధంగా చేర్చబడింది. రీసెటిల్మెంటు వ్యతిరేకాందోళన, మునగాల, కాళీపట్నం పోరాటాలు మున్నగు అగ్నిపరీక్షలలో కాకలుదీరి, ఆంధ్ర రైతాంగముయొక్క ఏకైక నాయకసంస్థగా వృద్ధిచెందింది. ఏ రాజకీయసంస్థయొక్క, పార్టీయొక్క తోకగా వుండక, రైతు వుద్యమముయొక్క వర్గస్వభావమునూ, స్వతంత్రతనూ కాపాడుతూ వచ్చింది. ప్రభుత్వ నిర్బంధాలనూ, జమీందార్ల దురాగతాలనూ ఎదుర్కొంటూ, మితవాదుల వ్యతిరేకతనూ, రైతు ఉద్యమ విచ్ఛిన్నకారుల కుట్రలనూ భగ్నంచేస్తూ, నేడు భారతదేశమందలి రైతువుద్యమానికి అగ్రగామిగా వుంది. ఇట్టి ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం యొక్క స్వతంత్రతను ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీకూడా గుర్తించియే యున్నది. కాని ఈ పూర్వచరిత్రను విస్మరించి, ఏ హక్కు అయితే పరమ ప్రామాణికంగా అంగీకరింపబడుతూ వచ్చిందో దానిని గణనజేయకుండా, తిరిగి ఈనాడు రైతుసంఘాన్నికాంగ్రెసుశాఖగా చేయబూనటం శోచనీయం.

ఇదే వైఖరిని అన్నిపార్టీలు అవలంబిస్తే-

కాంగ్రెసు శాఖగా రైతుసంఘాన్ని నిర్మిస్తే, కాంగ్రెసు బలపడుతుందని వీరు భ్రమపడుతున్నారు. ఇదే వైఖరిని గనుక అన్నిపార్టీలు అవలంబిస్తే వచ్చే ఫలితాలను వీరు గుర్తించారా? కాంగ్రెసు కాంగ్రెసుపార్టీ రైతుసంఘాలను, జస్టిసుపార్టీ జస్టిసు రైతుసంఘాలను, కమ్యూనిస్టుపార్టీ కమ్యూనిస్టు రైతుసంఘాలను, ముస్లింలీగు, హిందూమహాసభ మున్నగునవి వారివారి రైతుసంఘాలను, నిర్మిస్తే ప్రజాజీవితంలోనే అల్లకల్లోలం ఏర్పడదా? సాంఘిక భద్రతకు ముప్పు వాటిల్లదా? ఒక్కొక్కపార్టీకి ఒక్కొక్క రైతుసంఘం చొప్పున ఒక్కొక్క గ్రామంలో అరడజను రైతుసంఘాలువుంటే గ్రామజీవితమే తల్లక్రిందులుకాదా? బలీయమైన రైతువుద్యమమూ, రైతుసంఘమూ విచ్ఛిన్నమైపోవా?

స్వతంత్ర రైతువుద్యమ బలంమీదనే జాతీయోద్యమ బలంకూడా ఆధారపడివుంది. కాంగ్రెసునుబలపర్చుటకై అనేక పరిశోధనలను తలపెట్టుచున్న కాళేశ్వరరావుగారివంటి వారికిది అర్థంకాకపోవచ్చును. కాని చరిత్రను తిరగవేసిచూస్తే, కన్పడేది ఇదే. 1936 తర్వాత రైతువుద్యమం అభివృద్ధి చెందుతున్నకొలదీ, జాతీయోద్యమాన్ని రాష్ట్రంలో మూలమూలలకుకూడా తీసుకుపోయింది. (మిగతా 6 వ పేజీలో)

★ సంపాదకీయం

ఆంధ్రలో మెడికల్ కాలేజీలు

మన దేశంలో ప్రజాసామాన్యానికి విజ్ఞానవంతులైన డాక్టర్లు అందుబాటులో లేరు. పల్లెలలో నివసించే కోట్లకొలది ప్రజలకు ఎట్టి వైద్యసహాయం లేదు. శాస్త్రవిజ్ఞానంలేని నాటు వైద్యులపైనే ప్రజలు ఆధారపడవలసి వస్తూంది. ఇందువల్ల ప్రజా ఆరోగ్యం చాలహీనస్థితిలో వున్నది. ఇంగ్లండు, అమెరికా, సోవియట్ యూనియన్‌వంటి నాగరిక దేశాలలో ఆయుఃపరిమాణం 45 సంవత్సరాలు వుండగా, భారతీయులు సగటున 23 యేండ్లు మాత్రమే బ్రదుకుతున్నారు

యుద్ధపరిస్థితులవల్ల, కరువువల్ల ప్రజల ఆరోగ్యం మరింత కుంటుపడింది. అంటుజాడ్యాలు వ్యాపించాయి. డాక్టర్లు తగినంతమందిలేక ప్రజలు నానాబాధలుపడుతున్నారు. మనదేశంలో ప్రతి 35 వేలమంది ప్రజలకు ఒకడాక్టరు మాత్రమే ఉన్నాడు. 60 వేల మందికి ఒకనర్సు మాత్రమే వుంది. దీనినిబట్టి ప్రజలకు వైద్యసహాయం అందజేయాలంటేనూ, అంటువ్యాధులను అరికట్టాలంటేనూ, ఎక్కువమంది డాక్టర్లు కావాలి. అందుకు వైద్యకళాశాలలను ఎక్కువగా స్థాపించాలి

మద్రాసు ప్రభుత్వం వైద్యకళాశాలలను గురించి నవంబరు 17 వ తేదీన ఒకప్రకటన చేసింది. మద్రాసు మెడికల్ కాలేజీలో 30 సీట్లు, ఆంధ్ర మెడికల్ కాలేజీలో 45 సీట్లు ఎక్కువ చేస్తామనీ, మధురలో కొత్తగా మెడికల్ కళాశాలను (75 సీట్లతో) స్థాపించుతామనీ, తెలియజేసింది. మద్రాసు రాష్ట్రంలో 4 కోట్లకు పైన జనసంఖ్యవుంది. అర్హతవున్న విద్యార్థులు 400 కు పైగా యేటా వైద్యకళాశాలలలో సీట్లకోసం ప్రయత్నించి, దొరకక విఫలులవుతున్నారు. ఒకవైపున ప్రజారోగ్యాన్ని కాపాడటానికి డాక్టర్లు కావాలి. మరొకవైపున వైద్యవిద్య నేర్చుకోడానికి విద్యార్థులు చాలమంది ముందంజవేస్తున్నారు. ఉన్న లోటు వైద్యకళాశాలలు తగినంతగా లేకపోవడమే. మద్రాసు ప్రభుత్వం అంగీకరించిన స్కీము 150 మందికి మాత్రమే అదనంగా అవకాశం కలుగజేస్తూంది. ఇది యేమాత్రం చాలదు. మద్రాసు ప్రభుత్వం వైద్యవిద్యను వ్యాప్తిచేయడానికి యింకా ఎక్కువ కృషిచేయాలి.

కాకినాడలో సమావేశమైన ఆంధ్ర వైద్య మహాసభ, గుంటూరులోనూ, రాయలసీమలోను వైద్యకళాశాలలను నిర్మించాలని తీర్మానించింది. ఆంధ్రులం మద్రాసు రాష్ట్రంలోనే సుమారు రెండు కోట్లు వున్నాం. ఇప్పటికి విశాఖపట్నంలో ఒక వైద్యకళాశాల మాత్రమే వుంది. జనసంఖ్యను, వైశాల్యాన్ని బట్టిచూచినా ప్రజారోగ్య రక్షణకు ఆంధ్రులకు మరో రెండు వైద్యకళాశాలలు కావాలి. అందుచే సోదర పత్రికలు, ఆంధ్ర ప్రజానీకం రాయలసీమలోను, గుంటూరులోను వైద్యకళాశాలలు స్థాపించాలని ఆందోళన చేయాలి.

ఈ సందర్భంలో వెనుకటి చరిత్రను వుదహరించడం అప్రస్తుతం కాదనుకొంటాము. 1927 లో వైజాగ్‌లోని ఎల్. యం. పి. కోర్సు ఎత్తివేసినపుడు, గుంటూరులో హాస్పిటలు బిల్డింగులు నిర్మించాక, ఒక మెడికల్‌స్కూలు స్థాపించుతామని మద్రాసుప్రభుత్వం వాగ్దానం చేసింది. అందుకొరకు బిల్డింగులను గుంటూరులో నిర్మించిందికూడ. కాని, ఇంతవరకు వైద్యకళాశాలను స్థాపించలేదు.

ఈ లోగా 1938 లో మద్రాసులోని రాయపురం మెడికల్ స్కూలును కాలేజీగా మార్చారు. అపుడు అధికారంలో వున్న కాంగ్రెసు మంత్రివర్గం ఇకమీదట నిర్మించబోయే మెడికల్ కాలేజీని గుంటూరుకు యిస్తామని వాగ్దానం చేసింది.

కాని నవంబరు 17 న చేసిన మద్రాసు ప్రభుత్వ ప్రకటనలో గుంటూరు విషయం ఎత్తనే లేదు. ఇది వెనుకటి వాగ్దానాలకు విరుద్ధంగా వుంది. కాబట్టి మద్రాసు ప్రభుత్వం ఎక్కువగా వైద్యకళాశాలలు నిర్మించాలని కోరుతాము. గుంటూరు, రాయలసీమ, మధుర - కనీసం యీ మూడు కేంద్రాలలోనూ స్థాపించాలంటాము. మద్రాసురాష్ట్ర ఆదాయం 16 కోట్ల నుండి 32 కోట్ల రూపాయలకు వృద్ధిచెందింది. కాబట్టి ఆర్థికంగా యిది అసంభవమైన విషయమేమీకాదు. అవసరమైనదీ, సాధ్యమయింది కూడ.

ఒకవేళ హాస్పిటలు పరికరాలు మూడింటికీ తెప్పించడం సాధ్యంగాకపోతే, నిర్మించబోయే ప్రథమ వైద్యకళాశాలను గుంటూరులోనే స్థాపించాలి. వెనుకటి వాగ్దానాలను అనుసరించినా, ఆంధ్రులకు న్యాయం జరగాలన్నా, యిదేచేయాలి.

యువకులు ప్రజావిజ్ఞానాన్ని అభివృద్ధిచేయాలి

9 వ కృష్ణాజిల్లా యువజన మహాసభలో ప్రముఖుల ఉపన్యాసాలు

— మా విలేఖరి

ఘంటసాల చరిత్రాత్మకమైన గ్రామం. విశాలమైన వీధులు. మధ్య పురజనుల సభలకు అనువైన ఖాళీప్రదేశముంది. ప్రాచీనమైన గ్రామం. అచట దొరికిన ప్రాచీనాంధ్రుల కళానైపుణ్యాన్ని తెల్పే శిల్పాలను పాశ్చాత్యులు గొనిపోయి, తమ ప్రాచ్యశిల్ప కళా మందిరాలను అలంకరించుకున్నారు. నేటికి కూడ చుట్టూ 5 మైళ్ళ చతురంలో భూమిని త్రవ్వుతూంటే అనేక శిల్పాలు బయటపడుతున్నాయి

ఘంటసాల ప్రాచీన ఔన్నత్యంతోపాటు కాంగ్రెసు ఉద్యమంలోను, రైతుఉద్యమంలోనూ కూడా వన్నె తెక్కింది. ఈ శతాబ్దారంభంలో చల్లపల్లి రాజా సాముదాయిక భూమిని (గోటకం = గోభూమి) ఆక్రమణ చేయదలచినపుడు గ్రామ ప్రజలు ఐక్యకంఠంతో ఎదిరించారు. రాజా ఇతర గ్రామాలలో ప్రజలను మోసంచేసి, చీల్చి జయం పొందగలిగాడు. కాని ఘంటసాల ప్రజలు గొర్రెపాటి వెంకయ్య (నరసన్నగారి) నాయకత్వాన ఐకమత్యంతో పోరాడారు. 300 ఎకరాల గోభూమిని రక్షించుకున్నారు. రైతాంగానికిఆదర్శప్రాయులయ్యారు.

ఆహ్వానసంఘం

ఈ క్షేత్రంలో 9 వ కృష్ణాజిల్లా యువజన మహాసభలు జరిగాయి. నవంబరు 23 తేదీ నుంచి 26 వ తేదీ ఆఖరువరకు గ్రామం ఉత్సాహవంతులైన యువకులకోలాహలంతో విరాజిల్లింది. నిజంగా జిల్లా యువజనుల పండుగలా అనిపించాయి. వీటిని సాగించటంలో ఘంటసాల ప్రజలు సంపూర్ణ సహకారం చేశారు. గ్రామ ప్రాచీన ఔన్నత్యానికి వన్నె తెచ్చారు.

1936 వ సంవత్సరంలో యీ గ్రామంలో దెబ్బలాట జరిగింది. నాటినుంచి రెండుపార్టీలు ఏర్పడి గ్రామంలో ఐకమత్యం చెడింది. ఈసభల సందర్భంలో రెండుపార్టీల వారు కలసి సంపూర్ణ సహకారం చేశారు. గ్రామ పంచాయితీబోర్డు అధ్యక్షులు, ఒక పార్టీ నాయకులు అయిన గొర్రెపాటి వెంకట్రామయ్యగారు ఆహ్వాన సంఘాధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. రెండవ పార్టీకి చెందిన గొర్రెపాటి వెంకటేశ్వర్లుగారు ఆహ్వానసంఘ కార్యదర్శిగా పనిచేశారు. అంతా కలసి గ్రామంలో చందాలు వసూలుచేశారు. యువకులు వాలంటీర్లుగా చక్కగా కృషిచేశారు. ఈ సందర్భంలో యింకోవిషయం ముఖ్యంగా ఉదహరించవలసివుంది. చేనేత పారిశ్రామికులు యీ సభలకు సర్వవిధాల తోడ్పడ్డారు. రు 130 లు చందా యిచ్చారు. 60 మంది పద్మశాలీయువకులు వంట, వడ్డనలో వాలంటీర్లుగా పనిచేశారు.

గ్రామ పార్టీ కక్షలను తొలగించడానికి, ప్రజలలో ఐకమత్యం నెలకొల్పడానికి సభలు సాయపడ్డాయి. ఆహ్వానసంఘంలో అందరూ కలసి పనిచేశారు. ఈ ఐకమత్యం 26 వ తేదీన ఆహ్వానసంఘ కార్యదర్శిగారు గొర్రెపాటి వెంకటేశ్వర్లుగారు టీపార్టీ చేసినపుడు ద్యోతకమైంది. ఈవిందుకు రెండుపార్టీలనాయకులు హాజరయ్యారు. 8 యేండ్లుగా ఒకరితో నొకరు మాట్లాడనివారు, కలిసి ఫొటో తీయించుకున్నారు. ఆహ్వానసంఘంలో కలసి పనిచేయడంవల్ల సభలను జయప్రదంగా చేయడంవల్ల రెండుపార్టీల హృదయాలు కలిశాయి ఈ కలయిక ముందు గాఢమైన స్నేహంగా పెంపొందుతుందనీ, గ్రామపార్టీలు పోయి ఐకమత్యం విరాజిల్లాలనీ గ్రామస్థులు, సభలకు వచ్చిన పెద్దలు, జిల్లా యువజనులు ఆశించుతున్నారు.

ఆటల పోటీలు

23 వ తేదీన చరిత్ర ప్రసిద్ధమైన గోటకంలో ఆటలపోటీలు ప్రారంభమయ్యాయి. చెడుగుడు, చెర్రు, కొక్కో ఆటల పందేలు జరిగేయి. వడిగా పరుగెత్తుట, గుండు విసరుట, ఎత్తుదూకుట, గడసాయంతో దూకుట, దూరందూకుట వగైరా విషయాలలో పోటీలు జరిగాయి.

యీ ఆటలను ఆడించు మధ్యవర్తులను, పోటీలలో పాల్గొంటున్న యువకులను చూస్తూంటే వీక్షించేవారికి ఎంతో సంతోషమయింది. మధ్యవర్తులు న్యాయంగా ఖచ్చితంగా రూల్సును అమలుజరిపారు. పోటీదార్లలో దురభిమానం మచ్చుకైనా కాన్పించలేదు. ఒకవేళ మధ్యవర్తి తెలుసికోలేక పోయినాసరే. మార్కును కొట్టుకొన్న ఆటగాడు వెంటనే మధ్యవర్తికి తెలిపి, న్యాయం జరుగునట్లు చేసేవాడు. అంటే పోటీలో అర్హులైనవారే జయంపొందాలి గాని, తాను జయించడం ప్రధానం కాదు, అనే ఆటగాండ్రఆదర్శాన్ని (Sportsmanship) మన యువజనులు అమలుజరుపుతున్నారన్నమాట. ఇది చూచి, కాలిబంతి (Foot - Ball) ఆటలో నేర్పరి అయిన కాట్రగడ్డ నారాయణరావు కాంగ్రెసు ఎం.ఎల్.ఏ. గారు ఎంతో మెచ్చుకొన్నారు. 26 వ తేదీన మహాసభ ఉపన్యాసంలో కూడ వారు యువజనులు నూతనచైతన్యాన్ని, కన్పరచుతున్నారని చెప్పారు.

24 వ తేదీ రాత్రి బహిరంగసభ జరిగింది. 'ప్రకృతి' సంపాదకులైన పుచ్చా వెంకట్రామయ్యగారు ఆరోగ్యాన్ని గురించి ఉపన్యసించారు.

ఈ సభలో ఎ. పాండురంగరావుగారు సైకిలు ఫీట్సు చేశారు. మామూలు సైకిలు మీద వీరు కన్పరచిన అద్భుతమైన చాతుర్యాన్ని ప్రేక్షకులు పొగిడారు. తరువాత వీరు కత్తిసాము, కర్రసాము చేసి చూపారు. ఆసనములు ప్రదర్శించారు. వివిధకండరాలు బలపడటానికి ఏ విధంగా శరీర వ్యాయామం చేయాలో పాండురంగారావుగారు చక్కగా వివరించారు. వీరి ప్రదర్శనాలు ప్రజలను ఆకర్షించాయి.

తరువాత విజ్ఞానప్రదర్శనాలు ప్రారంభమయినాయి. వివిధ తాలూకాలనుంచి వచ్చిన విజ్ఞానదళాలు అనేక కళారూపాలను ప్రదర్శించాయి. గుడివాడదళం 'పశ్చాత్తాపము'ను నాటకాన్ని, కోలాటం, సమిష్టిగానం ప్రదర్శించింది. దివివారు హరిదాసులు సమిష్టిగానం వగైరా ప్రదర్శించారు.

అధ్యక్షులైన స్థానం నరసింహారావుగారు ప్రదర్శనాల తరువాత ఉపన్యసించారు. అనుభవశాలురైన వీరు ప్రదర్శనాలలో పాల్గొన్న యువకులకు చక్కని సలహాల నిచ్చారు. బుడబుక్కలవేషం వేసిన కోలవెన్ను బాలుని సమయస్ఫూర్తికి మెచ్చుకొన్నారు. ఈ బాలుడు తనడక్కి మ్రోగనపుడు "ఇక్కడ మందువేసే వైద్యు లెవరైనా వున్నారా? బాబూ" అన్నాడు. ఎవరో తుంటరి చాటు నుంచి వేదికపై గడ్డవేస్తే, "ప్రజల సభలపై గడ్డలేసే రౌడీలను భరతాంబ మెచ్చదు." అని సమయస్ఫూర్తితో దెబ్బగొట్టాడు. ప్రజలు హర్షధ్వానులు చేశారు తరువాత నటకావతంసుడు 'పశ్చాత్తాపం' నాటకంలో తండ్రిపాత్ర ధరించిన అచ్చయ్యగారి అభినయాన్ని మెచ్చుకున్నారు. సంభాషణ చక్కగా వుందనీ, అభినయంలో నాట్యకళాప్రపూర్ణ టి. రాఘవాచారి గారిఛాయలు కన్పించుతున్నాయనీ, అన్నారు. ప్రదర్శనాలన్నీ దేశభక్తి, కరువునివారణ ఇతివృత్తంగా కలిగి, ప్రజలకు మార్గాన్ని సూచించుతున్నాయని పొగిడారు. నాట్యకళకు ప్రజా విజ్ఞానంలో ప్రముఖస్థానం వుందన్నారు. దానిని అభివృద్ధి చేయడానికి యువజనులు ఇతోధికంగా కృషిచేయాలని కోరుతూ ఉపన్యాసం ముగించారు.

వైజ్ఞానిక మహాసభ

25, 26 తేదీలలో రాత్రి భోజనానంతరం వైజ్ఞానిక ప్రదర్శనాలు జరిగాయి. ఇందుకొరకు గోటకంలో "ప్రజా విజ్ఞానమండలి వేదిక" నిర్మించబడింది. 25 వ తేదీ రాత్రి ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ సహాయకార్యదర్శి ముక్కామల నాగభూషణంగారు సభను ప్రారంభించుతూ ఉపన్యసించారు. ఆంధ్ర నాట్యరంగంలో సుప్రసిద్ధులైన 'నటకావతంస' స్థానం నరసింహారావుగారు అధ్యక్షత వహించారు.

ఈ సభలో సుమారు 8 వేలమంది ప్రజలు పాల్గొన్నారు. సాయంకాలంనుంచి చుట్టు ప్రక్కల గ్రామాలనుండి రైతులు, కూలీలు యువకులు జట్లుజట్లుగా బయలుదేరి వచ్చారు. 2 వేలదాకా స్త్రీలుకూడ సభను అలంకరించారు. ముక్కామల నాగభూషణంగారు పూర్వంనుంచీ ఆంధ్రుల కళలు ఎలా పెంపొందాయో తెలిపారు. పూర్వం పల్లె ప్రజలు పాడిన "జానపదాలు" చదివి వినిపించారు. యువజనులు ప్రాచీన కళారూపాలు తీసికొని, ఆధునిక పరిస్థితులకు అనుగుణ్యంగా పెంపొందించాలని ఉద్బోధించారు.

చిత్రకళా ప్రదర్శనం

గ్రామ పాఠశాలలో సోవియట్ చిత్రాల ప్రదర్శనం ఏర్పాటు (మిగతా 6 వ పేజీలో)



జిల్లా యువజనసంఘ కార్యనిర్వాహక సభ్యులు, ఆహ్వానసంఘ అధ్యక్షకార్యదర్శులు, మహాసభకు విచ్చేసిన పెద్దలు



ఊరేగింపు

జర్మన్ కమ్యూనిస్టు నాయకుని హత్య

— విలియం రస్ట్

జర్మన్ కమ్యూనిస్టు నాయకుడైన ఎర్నెస్ట్ థాల్మన్, నాజీ హంతకుల చేతుల్లో అతిదారుణంగా మరణించాడు. 'బూషెన్ వాల్డ్' కాన్సెంట్రేషన్ క్యాంపుపై అగస్టు 28 వ తేదీనాడు జరిగిన అమెరికా విమాన దాడి ఫలితంగా, క్యాంపులో నిర్బంధితుడై యున్న థాల్మన్ మరణించాడని జర్మన్ వార్తాశాఖ ప్రకటించింది.

కాని అగస్టు 28 వ తేదీన ఈ ప్రదేశంపై అమెరికా విమానాలు దాడి జరపనేలేదని అధికారరీత్యా ప్రకటించబడ్డది. 200 మైళ్ళ దూరంలోవున్న మరొక దేశంపైచేయబడింది.

దీనినిబట్టి థాల్మన్, జర్మన్ సోషల్ డెమాక్రటిక్ ప్రముఖుల్లో ఒకరైన డాక్టర్ బ్రెషీడ్, యితర ఫాసిస్టు వ్యతిరేక నాయకులతోసహా నాజీలచేతనే వధింపబడ్డాడనీ, నాజీలు తమ అమానుషకృత్యాన్ని మరుగుపెట్టడానికే అమెరికా విమానాలు దాడిచేశాయన్న కధను కల్పించారనీ, నిస్సంకోచంగా రుజువవుతుంది.

థాల్మన్ కార్మికవర్గానికి అనుంగు ముద్దుబిడ్డ. కార్మికవర్గాభివృద్ధికి అతని జీవితం ధారబోశాడు. లక్షలాది ప్రజల ప్రేమ విశ్వాసాలను చూరగొన్నాడు. అంతర్జాతీయ సమావేశాల్లో అనేకపర్యాయాలు అతణ్ణి నేనుకలుసుకున్నాను. శారీరకంగా బలిష్ఠుడే కాకుండా, తాను ప్రేమించిన ఆశయంకొరకు, తలపెట్టిన కార్యక్రమంకొరకు శక్తివంతంగా ప్రచారం చేసేవాడు. 11 సంవత్సరాలపాటు థాల్మన్ నరకతుల్యమైన నాజీ కాన్సెంట్రేషన్ క్యాంపులో యమయాతన ననుభవించాడు. ప్రపంచప్రజాస్వామ్యవాదు లందరూ యీ 11 సంవత్సరాలూ యెడతెగక అతని విడుదలకై తీవ్రాందోళన సాగించారు.

కాన్సెంట్రేషన్ క్యాంపులో యీ విప్లవ మూర్తిని చీకటికొట్లో నిర్బంధించి నోట ఉచ్చరించరాని చిత్రవధలకు గురిచేశారు నాజీ నరపశువులు. ఇన్ని విపరీతదారుణ చర్యలకు గురైనా, అతని వజ్రకాయం మొక్కవోలేదు. అతడి జవసత్వాలు కుప్పించలేదు. అంతకన్నా బలవత్తరమైన అతని మనోదార్ఢ్యం యీషన్మాత్రమైనా సడలించలేదు.

థాల్మన్ మరణించాడు. అయితే నాజీ నరహంతకులు యీ వీరమరణాన్ని తమ విజయంగా భావించుకొని మురిసిపోవడం కేవలం వెర్రితనం. అతడి పవిత్రనామం అవినాశమైనది, శాశ్వతమైనది.

థాల్మన్ వయస్సు 58. తన ప్రారంభ జీవితాన్ని వివిధ పారిశ్రామిక క్షేత్రాల్లో కార్మికుడుగా గడిపాడు.

ప్రష్యా సైనిక నిరంకుశత్వాన్ని నిర్మూలించడంలో థాల్మన్ ప్రధమ శ్రేణిలో నిలిచి పోరాడాడు. ప్రధమసామ్రాజ్యవాదయుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, యుద్ధరంగంలో సైనికపంక్తుల మధ్యనే నిలబడి ప్రచండంగా పోరాడాడు. జర్మన్ సైనికుల్లో రహస్యంగా కరపత్రాలు పంచిపెట్టాడు. 1918 చివరభాగంలో జర్మనీలో చెలరేగిన విప్లవపోరాటంలో చేరాడు. అనంతరం జరిగిన హాంబర్గ్ మునిసిపల్ యెన్నికల్లో విజయం సాధించాడు. 1920 లో యీ విప్లవయోధుడు తానొక్కడే కమ్యూనిస్టు పార్టీలో చేరడంకాకుండా, తనతోపాటు హాంబర్గ్ స్వతంత్ర సోషల్ డెమాక్రాటిక్ పార్టీలో నూటికి 90 మందిసభ్యుల్ని కమ్యూనిస్టుపార్టీలోకి తీసుకుని వచ్చాడు. నౌకా కార్మికుడుగా బయల్దేరిన థాల్మన్ తన అచంచల కార్యదీక్షద్వారా, కార్మికప్రజానీకంఎడల తానాచరించిన సేవ ద్వారా, క్రమేణాకమ్యూనిస్టుపార్టీనాయకస్థానం అలంకరించాడు.

హిట్లర్ వ్యతిరేక పోరాటంలో లక్షల మంది జర్మన్ ప్రజలు థాల్మన్ నాయకత్వాన్ని అనుసరించారు. 1932 లో హిట్లర్ ఢాక ముందు అధ్యక్షస్థానానికి జరిగిన యెన్నికలో, కమ్యూనిస్టు అభ్యర్థిగా నిలబడ్డ యితనికి 50 లక్షలు పైగా ఓట్లు వచ్చాయి.

రీచ్‌స్టాగ్ పార్లమెంటు భవనాన్ని నాజీలు భస్మీపటలం చేసినవెంటనే (1933 మార్చి) థాల్మన్ అరెస్టయినాడు. అప్పట్లో అతడు రహస్యోద్యమంలో పనిచేస్తూ ఉండేవాడు. అతని సాంకేతిక స్థలాన్ని దేశద్రోహులు ప్రభుత్వానికితెలియజేశారు. గడచిన 11 సంవత్సరాల్లోనూ యీ విప్లవ వీరుణ్ణి బహిరంగ విచారణకు తేవడానికి నాజీలు సాహసించలేక పోయారు. అతని మరణం కోట్లాది ప్రజలను విచారసాగరంలో ముంచేసింది. ఐతే, అతడు యే స్వేచ్ఛా, ప్రజాస్వామ్యాలకై పోరాడాడో, అలాంటి మహదాశయాలను ప్రేమించే ప్రపంచ ప్రజానీకమంతా అతని జీవితకాలంలో చేసిన కృషిని తమ అమూల్యమైననిధిగా భావించుకుంటారు.



— ఎర్నెస్ట్ థాల్మన్ —

రైతుఉద్యమ విచ్ఛిన్నతను ఆంధ్రరైతాంగం సహించదు

డిసెంబరు 5, 6, 7 తేదీలలో ఆంధ్ర రాష్ట్రరైతుసంఘ జనరల్‌బాడీ సమావేశము బెజవాడలో కడియాల గోపాలరావుగారి అధ్యక్షతక్రింద జరిగింది. 11 జిల్లాల నుండి 72 మంది సభ్యులు హాజరైనారు. దీర్ఘమైన చర్చలు జరిగిన పిమ్మట ప్రస్తుతం రైతుల నెదుర్కొంటున్న అనేక సమస్యలపై తీర్మానములు గావింపబడినాయి.

ఈక్రిందితీర్మానం నండూరి ప్రసాదరావుగారిచే ప్రతిపాదింపబడి, చలసాని వాసుదేవరావుగారిచే బలపరచబడిన పిమ్మట ఏకగ్రీవంగా అంగీకరింపబడినది.

"గాంధీజీ తన నిర్మాణ కార్యక్రమాన్ని విశదీకరించుతూ కాంగ్రెసువాదులను రైతులలోను, కూలీలలోను పనిచేయవలసినదిగా హెచ్చరించుటను ఈసంఘమువారు హర్షించుచున్నారు. ఆంధ్రరైతాంగములో పనిచేయదలచెట్టు కాంగ్రెసువాదులందరునూ ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘములో జేరి కృషిచేయవలసినదిగా కోరుచున్నారు.

"ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం 1928 లో ఏర్పడినప్పటినుండీ రైతాంగ సేవచేస్తూ, 1936 నుండీ అఖిలభారత కిసాన్‌సభ శాఖగా పనిజేస్తూ వుంది ప్రథమంలో కొలదిమంది రైతుశ్రేయోభిలాషులతో - వారు భిన్నభిన్న రాజకీయ దృక్పథాలకు జెందినా - ఏర్పరచబడి, క్రమక్రమంగా అభివృద్ధి జెందుతూ, నేడు రాష్ట్రరైతాంగముచే నాయక సంస్థగా గుర్తింపబడుచున్నది. రైతుసంఘ జెండా యగు ఎర్రజెండా నాయకత్వంక్రింద అనేక పోరాటాలు జరుపబడినవి. రాష్ట్రంలో బలిష్ఠమైన రైతుఉద్యమాన్ని నిర్మించుటద్వారా జాతీయోద్యమాన్ని మారుమూల గ్రామాలకు గూడా తీసుకుపోయింది. ఇన్ని సంవత్సరములనుండీ గావించిన కృషి ఫలితంగా ఆంధ్ర ప్రజాజీవితంలో ఒక ప్రత్యేకమైన గౌరవస్థానాన్ని సంపాదించుకుంది. నేడు 2000లకుపైగా గ్రామాలలో ఇంచుమించు లక్షవేల సభ్యత్వం కలిగియుంది. రాష్ట్రమందలి 11 జిల్లాలలోనూ జిల్లా రైతుసంఘము లేర్పడి, రైతాంగముయొక్క దైనందినసమస్యలపై పనిజేస్తున్నవి. వేలకొలది సుశిక్షితులైన ప్రచారకులు దీక్షతో సంఘ కృషిని గావిస్తున్నారు. కాబట్టి రైతాంగసేవ చేయదలచి ముందుకువచ్చు కాంగ్రెసువాదు లందరూ ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంలో జేరి, దానిని బలపరిచి, రైతుఉద్యమాన్ని మరింత ఉన్నత స్థానమునకు తీసుకొనిపోవుట వారి కర్తవ్యమని ఈ సంఘమువారు తెలియజేయుచున్నారు

"కాని రైతుఉద్యమ విచ్ఛిన్న కారులగు కొందరు వ్యక్తులు, ముఠాలు, అఖిలభారత కిసాన్‌సభయొక్కయు, ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం యొక్కయు పాలసీనిగూర్చి, కార్యక్రమమునుగూర్చి, ఆచరణ విధానమును గూర్చి దుష్ప్రచారంచేస్తూ, ఆంధ్రలో పోటీ రైతుసంఘాలనుఏర్పరుస్తున్నారు. అందులకు కాంగ్రెసువాదుల సహాయముగూడ పొందజూస్తున్నారు. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘమునకు పోటీగా రైతుసంఘములను పెట్టుట రైతుఉద్యమ విచ్ఛిన్నతకే దారితీయగలదు.

"ఆంధ్రలో రాష్ట్రకాంగ్రెసు అసెంబ్లీని నిర్మించ పూనుకొన్న శ్రీకాశేశ్వరరావు పంతులుగారు రైతుసంఘ నిర్మాణం విషయంలో వెలిబుచ్చిన అభిప్రాయము రైతుఉద్యమ విచ్ఛిన్నతకే దారితీయునని ఈసంఘమువారు అభిప్రాయ పడుచున్నారు. 'ఒకే పార్టీ, కాంగ్రెసుపార్టీ; ఒకే నాయకుడు, గాంధీజీ; ఒకే జండా, త్రివర్ణపతాక' యను నినాదంతో కాంగ్రెసు అసెంబ్లీకి అనుబంధంగా రైతు సంఘాల నేర్పరచబూనటం ప్రజాస్వామిక విధానమునకూ, కాంగ్రెసు సాంప్రదాయాలకూ, విరుద్ధం. రైతులు తమ స్వతంత్ర వర్గ సంఘముల నేర్పర్చుకొను హక్కును కాంగ్రెసు ఎల్లప్పుడూ గుర్తించియేయున్నది. అందుకు విరుద్ధంగా కాశేశ్వరరావు ప్రభృతులు కాంగ్రెసుకు అనుబంధ సంస్థగా రైతు సంఘాల నేర్పర్చబూనటం రైతాంగములో చీలికలను తెస్తుంది. ఏ పార్టీ కాపార్టీ కాంగ్రెసు రైతుసంఘాలనీ, జస్టిసుపార్టీ రైతు సంఘాలనీ, ముస్లింలీగు రైతుసంఘాలనీ, కమ్యూనిస్టుపార్టీ రైతుసంఘాలనీ ఏర్పర్చనచో రైతుఉద్యమానికి ద్రోహద మిచ్చుటకు మూలకుగా ద్రోహం చేయటమే యవుతుంది.

"రైతుసంఘం రైతాంగము యొక్క స్వతంత్ర వర్గసంస్థ. ఇది ఏ ఒక్క పార్టీ యొక్క సొత్తుగాదు. ఏ ఒక్క ముఠా రాజకీయాలను అనుసరించునది కాదు. రైతుశ్రేయోభిలాషు లందరూ — వారు ఏరాజకీయ కక్షకు జెందినా — ఈ సంస్థలో జేరి పనిజేయుటకు హక్కున్నది ఇందువిషయమై బెజవాడలో జరిగిన 8వ అఖిలభారత రైతు మహాసభ యొక్క తీర్మానమును దేశభక్తు లందరు గమనింప వలసినదిగా ఈ సంఘమువారు కోరుచున్నారు.

"ఆంధ్రరాష్ట్ర రైతుసంఘమునకు పోటీగా రైతుసంఘముల నేర్పరచుటగాని, రైతులు తమ స్వతంత్ర వర్గసంఘముల నేర్పర్చుకొను హక్కును నిర్లక్ష్యించేసి కాంగ్రెసు శాఖగా నిర్మించుటగాని, రైతుఉద్యమాన్ని బలహీనపర్చుటయే యగును. ఇది రైతు సేవగాదు; దేశసేవ గాదు. రైతుఉద్యమాన్ని చీల్చటం, జాతీయోద్యమాన్ని బలహీనపర్చటం. కాబట్టి పోటీ రైతుసంఘములను ప్రోత్సహించుటకూ, కాంగ్రెసు శాఖగా రైతుసంఘము నేర్పర్చుటకూ, తమ పూనికను విరమించవలసినదిగా శ్రీ కాశేశ్వరరావు ప్రభృతులను హెచ్చరించుచు, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘములో జేరి, రైతుఉద్యమమును విస్తృత పర్చవలసినదిగా ఈసభవారు కోరుచున్నారు. ప్రస్తుత విషమపరిస్థితులలో రైతుఉద్యమమును బలహీనపరచు ఎట్టిప్రయత్నమునైననూ ఎదుర్కొనవలసినదిగా యీ సంఘమువారు రైతాంగమునుకోరుచున్నారు."

నవ్య కవితా పితామహానికి జోహారులు

నవ్యసాహిత్య పరిషత్, అభ్యుదయ రచయితల సంఘ కార్యదర్శులు చేసిన విజ్ఞప్తి ననుసరించి ఆంధ్ర దేశమంతటా నవంబరు 30 వ తేదీని అప్పారాయ వర్ధంతి విజయవంతంగా జరిగింది. ఆ నాడు నవ్యకవితా పితామహానికి ఆంధ్రదేశమంతా జోహారులర్పించింది.

"అప్పారావు మహాకవి; మహాపురుషుడు. ముందు చూపేగాని, వెనక్కి పోవాలనేవాడు కాదు ఇలాంటిమహాపురుషుల్ని స్మరించడానికి పూనుకొన్న అభ్యుదయ రచయితల సంఘాన్ని అభినందించు తున్నాను" అంటూ గిడుగు సీతాపతిగారు బెజవాడ సభలో తమ ఉపన్యాసం ప్రారంభించారు.

అప్పారావుగారిని వ్యక్తిగతంగా ఎరిగిన సీతాపతిగారు, వారి జీవితవిశేషాలను విపులంగా తెలియజేశారు.

"అప్పారావు నిరాడంబర జీవి. ఎంతమంచి ఎన్నివిషయాలపై వాదోపవాదాలు సాగిస్తున్నా,వాటన్నిటినీఓపికతోజవాబులువ్రాస్తూనే ఉండేవాడు. సంస్కృతం, ఇంగ్లీషు ఒక్కమ్మడిగా చదువుతుండేవాడు. ఎఫ్. ఎ. చదువుతున్న రోజులలోనే చిన్నచిన్న పద్యాలు వ్రాసేవాడు.

"1890 91 లలో గిడుగురామమూర్తిగారు శాసనాలు పరిశోధించుతుంటే, అప్పారావుగారు ఎడిట్ చేస్తుండేవారు.

"కన్యాశుల్కం" లోని " విదో " అన్న పద్యం మొదట ఇంగ్లీషు భాషలో వెలువడే 'హార్ప్'లో ప్రకటించబడింది. 1891 లో "కన్యాశుల్కం" రచించి 1896 లో ప్రకటించారు. అది బాగా వ్యాప్తిచెందాక ఆరేళ్ళకు విపులీకరించి తిరిగి పునర్ముద్రణకు వచ్చింది. "కన్యాశుల్కం"లో నాటి కాలపు వ్యక్తులను, మానవ స్వభావాలను ప్రతిబింబింపజేశారు. "కన్యాశుల్కం"పేరుమరచిపోయినా, గిరీశాన్ని మరచిపోలేం. ఇలా, పాత్రసృష్టిలో మొదటిచెయ్యి ఆయనిది. "కన్యాశుల్కం" లాంటి నాటకం ఇంతవరకు తెలుగులోరాలేదని చెప్పవచ్చు.

"1908-09 లో పద్యరచన ప్రారంభించారు. "కల్పలత" "సరస్వతి" పత్రికలలో ఈయన పద్యాలు, పాటలు ప్రకటింపబడుతుండేవి. ఆధునిక గేయాలకు మూలపురుషులెవరు? అని వాదోపవాదాలు జరుగుతూ వుండేవి. అప్పారావుగారికంటే పూర్వం చిన్నపద్యాలు వ్రాసినవారు లేకపోలేదు. కాని వీరిపేరే పైకివచ్చింది. కారణం, అప్పారావుగారే చెప్పుకొన్నట్లు, "పాతకొత్తల మేలుకలయిక". అయితే ఈ ముత్యాల సరాల కోరణి పూర్వం లేదా అంటే, "మిశ్రమగతి షట్పదాల" లో ఉన్నా, వ్యాప్తి చెందలేదు. ఏలపాటలలో ఎన్నో ఉన్నాయి.

వాఙ్మయం సంఘచరిత్రకు దర్పణంగా ఉండాలి అనేవాడు. "అప్పారావు, ఆధునిక నాటకరచనకు, పద్యరచనకు ఆయన పితామహుడు. అనాటివరకువచ్చిన పుస్తకాలన్నీ (ఇంగ్లీషు) తెప్పించి చదివేవాడు. ఏమాత్రం ప్రతిభవున్నా, యువకులను ప్రోత్సహించి మద్దతు ఇచ్చేవాడు."

సీతాపతిగారు తమ ఉపన్యాసం ముగిస్తూ, "పూర్వీకులకంటె మనం క్షీణించి పోతున్నామని, మన జాతి నశించిపోతోందని నిరాశపడేతత్వం కాదు నాది. పరిణామం సహజం. జాతి, సాహిత్యమూ ముందుకు పోతూనే వున్నాయి ఒకవీధిలో నాటకమాడుతున్నారు. తండ్రి భుజాన ఎక్కిన కుర్రాడు, తనతండ్రికంటెఎక్కువభాగాన్ని చూడగల్గుతున్నానని. గర్వపడరాదు. తండ్రి భుజాలమీద ఉండటంవల్లనే తానది చూడగల్గుతున్నానని మరచిపోకూడదు. అలాగే తండ్రి, అంతా కుర్రాడే చూస్తున్నాడురా! అని అసూయ పడగూడదు. ఇదే సాహిత్యవిషయంలో కూడ పూర్వీకులకు,అభ్యుదయాన్నికోరేవారికివర్తించుతుంది." అని చక్కని ఉదాహరణతో అభ్యుదయాన్ని నిర్వచించారు.

"వీరేశలింగం, అప్పారావు, రామమూర్తి పంతులు - వీరు వ్యక్తులుకారు. ఉద్యమాలు. గురజాడ యుగకర్త; మహాకవి" అంటూ, కాకినాడ అభ్యుదయ-రచయిత సంఘశాఖ విజ్ఞానమండలి యాజమాన్యాన జరిగినసభలో శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు జోహారులర్పించారు.

" అప్పారావుగారి వ్యవహారికోద్యమం సక్రమమైనది గనుకనే, నానాటికి అభివృద్ధి చెందుతున్నది. ప్రజలను దృష్టిలో పెట్టుకొని ప్రజాశ్రేయస్సుకోసం రచనలు సాగించాలి" అని చెబుతూ ఉన్నవ లక్ష్మీనారాయణగారు అప్పారావుగారి రచనలలోని ఉత్కృష్టతను గుంటూరుసభలో ఉగ్గడించారు. గుంటూరులో నవ్యసాహిత్యపరిషత్, అభ్యుదయరచయితల సంఘాల యాజమాన్యాన సభజరిగింది. ఇంకా, శ్రీ దేశరాజు కృష్ణశర్మగారు, "సరససారస్వత సమితి" సంపాదకులు శ్రీ ముదునూరు వెంకటేశ్వరరావుగారు, అప్పారావుగారు ప్రజావైజ్ఞానిక ప్రబోధానికెలా తోడ్పడ్డారో వివరించారు.

"అప్పారావుగారు ఈ యుగానికిఒకవిశిష్టమూర్తి; వీరు బీజప్రాయంగా అన్నిటికీదిద్దినవరవళ్ళే ఈనాడు నవ్యసాహిత్య మహాసంస్థలై వర్ధిల్లినాయి" అంటూ రామచంద్రపురంలో, ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రిగారు కొనియాడారు.

"జీవభాషలోనే రచనలు సాగించాలని గిడుగు రామమూర్తిపంతులు ఒక విప్లవం లేవదీశాడు. అప్పారావుగారు దానినిముందుకు నడిపి సృష్టిచేశారు. ఈనాటికైనా ఆయనను ఆంధ్రులు గుర్తించినందుకు ధన్యులు." రాజమంద్రిలో సభ కధ్యక్షత వహించిన భమిడిపాటి కామేశ్వరరావుగారన్నమాట లివి.



——శ్రీ॥ శే॥ గురజాడ అప్పారావు——

జీవభాష (Spoken word) కై అప్పారావుగారి కృషిని గురించి పింకా గణపతిశాస్త్రి, జనమంచి కామేశ్వరరావుగారలు మాట్లాడారు. తర్వాత, శ్రీ రామాచారిగారి నాట్యమండలివారు "కన్యాశుల్కం"లోని కొన్ని దృశ్యాలను ప్రదర్శించారు.

ఇలాగే, సారస్వతోపాసకులు, భాషాభిమానులు, ఏలూరు, పచ్చలతాడిపర్రు, మదనపల్లి, అంతర్వేదిపాలెం, విజయనగరం, హైద్రాబాదులలో అప్పారావుగారిని స్మరించుతూ వర్ధంతి జయప్రదంగా జరిపారు.

★ రాయలసీమ ఆహారపరిస్థితిపై

గొర్రెపాటివారి అసందర్భ ప్రకటనలు

గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, రామకుమారవర్మగారలు రాయలసీమలోని ఆహార పరిస్థితిపై చేసిన ప్రకటనలు వాస్తవిక పరిస్థితులకు సత్యదూరము. రైతులకు అనర్థదాయకమూనై యున్నవి.

రాయలసీమలోని ఆహారపరిస్థితిని చక్కదిద్దడానికి ధాన్యసేకరణ విధానం మిక్కిలి ఉపయోగకరం. అలాంటి ధాన్యసేకరణ విధానాన్నే వ్యతిరేకిస్తూ, కనీసం 30 యకరాలలో ధాన్యం పండించే రైతులనుండి కూడా ధాన్యం వసూలు చేయకూడదని వెంకటసుబ్బయ్యగా రంటున్నారు. ఆ విధంగాచేస్తే చాలామంది రైతులను ఈ స్కీము నుండి తప్పించవలసి వుంటుంది. రాయలసీమలో కొన్ని ప్రాంతాలలోనూ, కొంతమంది రైతుల వద్దనూ, కల మిగులు ధాన్యాన్ని, అనగా జొన్నలు, కొర్రలు, వగైరాలను అలాగే వుంచితే కేవలం బయటి జిల్లాల నుండి బియ్యం తెప్పించడంద్వారా రాయలసీమలోని ఆహారపరిస్థితిని చక్కదిద్దడం సాధ్యం కాదనీ, ప్రజానీకం తిండిలేక అల్లాడవలసి వస్తుందనీ, వెంకట సుబ్బయ్యగారు గమనించారా!

పోనీ, వారి ప్రకటన, తమ అవసరాలకు పోగా ఎక్కువ ధాన్యాన్ని పండించే రైతులకైనా లాభకరంగావుంటుందా? అంటే: ఖచ్చితంగా ఉండదని చెప్పాలి. ఎందువల్లనంటే, నంద్యాల, కోయిల కుంట్ల, తాడిపత్రి, రామదుర్గంమున్నగుమిగులుప్రాంతాలలోనూ, బురుజుల వగైరా తరుగు ప్రాంతపు గ్రామాలలోనూ, గూడా గత సంవత్సరం మిగులు ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనలేదు. ఆ మిగులు ధాన్యాన్ని అక్కడేవుంచి ప్రభుత్వం బయటిజిల్లాలనుండి వచ్చే దిగుమతులను తరుగుప్రాంతాలకుసర్దుతూ వచ్చింది. కోటాలు సరిపోక తరుగుప్రాంతాల ప్రజలు నానా అవస్థలూ పడ్డారు. కంట్రోలు ధరలకంటే రెట్టింపు ధరలకు కూడా ధాన్యం దొరకలేదు. రాయలసీమలోనే పైన చెప్పబడ్డ మిగులు ప్రాంతాలలో షావుకార్లు రైతులవద్దనుండి కంట్రోలు ధరలకంటె తక్కువ ధరకు కొననారంభించారు.

ఇంతలో ఈ సంవత్సరపు కొత్త పంటలు వచ్చాయి. ధర్మవరం,పులివెందుల, జమ్మలమడుగు వగైరా కొన్ని ప్రాంతాలు మినహా మొత్తంమీద రాయలసీమలో ఈ సంవత్సరం గత రెండుసంవత్సరాలకంటె మంచిపంటలు పండినయి. దానితో మార్కెటుధరలు బాగా పడిపోయినయి. కోయిలకుంట్ల తాలూకాలో పుట్టి జొన్నలకు కంట్రోలురేటు రు. 175 లు వుంటే, మార్కెటులో రు. 145 లకు కూడా కొనేవారు కనుపించడంలేదు. బళ్లారిజిల్లా రామదుర్గం ప్రాంతంలో కొర్రలు రు. 1 కి 12 శేర్లు యిస్తామన్నా ఎవ్వరూ కొనడంలేదు. తాడిపత్రి తాలూకాలో జొన్నలు కంట్రోలుధర రు. 1 కి 5½ శేర్లుంటే రు. 1కి 6 శేర్లు యిచ్చినా ఎవ్వరూ కొనడంలేదు. ఇదంతా ప్రభుత్వంకంట్రోలుధరలకు మిగులు ధాన్యాన్నంతా కొని తరుగుప్రాంతాలలో స్టాకు చేయకపోవడంవల్ల సంభవిస్తున్నది. అందుచేత తమఅవసరాలుపోగా మిగులుధాన్యాన్ని పండించే రైతులకు సరియైన ధరలు రావాలన్నా, తరుగుపంటలుగల రైతులకూ, ప్రజలకూ కంట్రోలుధరలకు సక్రమంగా ఆహారముందాలన్నా, మధ్యవర్తులమీద ఆధారపడకుండా ప్రభుత్వమేరైతులనుండి మిగులు ధాన్యాన్ని కంట్రోలుధరకు సేకరించి, తరుగు ప్రాంతాలలో స్టాకుచేసి ప్రజలకు సప్లయి చేయాలి. ఇదే రాయలసీమలో రైతాంగమంతా కోరుతున్న కోరిక. ఈ కోరికలకు వ్యతిరేకంగా వెంకట సుబ్బయ్యగారు ధాన్య సేకరణను వ్యతిరేకించడమూ, రాయలసీమ ప్రజలు వడ్లబస్తా ధర రు. 12 లకు అనుకూలురని ప్రకటించడమూ, రాయలసీమ రైతుల, ప్రజల కోరికలకు విరుద్ధమైన ప్రకటనలు.

ధర్మవరం, పులివెందుల, జమ్మలమడుగు వగైరా ప్రాంతాలలో ఈయేడు పంటలు పోయినయి. ఆ ప్రాంతాల రైతులకు రిమిషన్ యివ్వాలని ఆందోళన చేయవలసివుంది. ఖచ్చితంగా ఎక్కడ పంటలు పోయినాయో అక్కడ రిమిషన్ కొరకు ఆందోళనచేయడం ద్వారానే మనం రిమిషన్ హక్కును సాధించగలుగుతాం. అంతేగాని, ఈ సంవత్సరం వర్షములు బాగా కురిసి, చెరువులు నిండి, రాయలసీమ మొత్తంమీద (కొన్ని ప్రాంతాలు మినహా) పంట బాగా పండినప్పటికీ పంటలు అసలే పండలేదంటూ ఆందోళన చేయడంవల్ల, నిజంగా పంటలు పోయినచోట్ల కూడా రిమిషన్ రాకుండా పోతుంది. ఆహార సమస్యా పరిష్కారానికి, రైతుల ధాన్యానికి న్యాయమైన ధరలు రాబట్టడానికి సరియైన అంచనా లేకుండాపోతుంది. అలాంటి పరిస్థితుల్లో రాయలసీమలో పంటలు అధ్వాన్నంగా పాడైపోయాయని వెంకటసుబ్బయ్యగారు ప్రకటించడం, "పంటలు పోయాయనీ, మళ్ళీ కరువు వస్తోందనీ, ధాన్య సేకరణ మానమనీ, వ్యవసాయంలో ఖర్చుకంటే ఆదాయం తక్కువ"నీ మొదలైనవి చేర్చి ప్రకటించితే "రైతుజనబాంధవుడుగా" కేవలం ప్రకటనలతో బైటికి కనపడాలని కాబోలు: రాయలసీమలోని (మిగతా 5వ పేజీ)

చెమటోడ్చి పనిచేసేవారికే ప్రభుత్వం

(8 వ పేజీ తరువాయి) చేయబడింది. 20 వ తేదీ 9 గంటలకు దీనిని ప్రారంభించుతూ శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు గంభీరోపన్యాస మిచ్చారు. భారతీయ చిత్రకళ యుగయుగాలలో ఎలా వృద్ధిచెందిందో వివరించారు. బౌద్ధయుగంలో భారతకళాసంపద అభివృద్ధి చెందిందనీ, దానికి చిహ్నంగా అజంతా, ఎల్లోరా గుహలలో శిల్పాలు, చిత్రాలు యిప్పటికీ వున్నాయనీ తెలిపారు. ముస్లిమ్ కళానైపుణ్యానికి చిహ్నంగా తాజ్‌మహల్, కుతుబ్‌మీనార్ వగైరా వున్నాయన్నారు. బ్రిటిషు ప్రభుత్వం కళా సంపదను పెంపొందించడానికి తగినంత కృషి చేయడంలేదని ఆక్షేపించారు.

ఆంధ్రులు బౌద్ధయుగంనాటినుండి చిత్రకళలలో నైపుణ్యం సంపాదించారనీ,అందుకు చక్కని ఉదాహరణలు నాగార్జునకొండ, అమరావతి, ఘంటసాలలలో దొరికినశిల్పాలేననీ, గోపాలకృష్ణయ్యగారు వెలిబుచ్చారు. ఘంటసాలలో భూమిని త్రవ్వినప్పుడు అనేక శిల్పాలు బయటపడుతున్నాయనీ, వాటిని కాపాడేబాధ్యత ప్రజలదేననీ హెచ్చరించారు.

తరువాత గ్రామంలోని స్త్రీ పురుషులువచ్చి సోవియట్ యుద్ధచిత్రాలను చూచారు.

ఊరేగింపు

సాయంకాలం 5 గంటలకు సభా ప్రారంభకులైన ఆంధ్రమహాసభ కార్యదర్శి శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారిని, అధ్యక్షుడు చంద్రశేఖరరావుగారిని, ఉపన్యాసకులు కాట్రగడ్డ నారాయణరావుగారిని యువజన నాయకులను 8 జతల యెడ్లబండ్లపై ఊరేగించారు. ఆహ్వానసంఘ కార్యదర్శిగారైన గొర్రెపాటివెంకటేశ్వర్లుగారు అశ్వారూఢులై, ఊరేగింపును నడిపించారు. దానివెనుక బాండుదళం నడిచింది. తరువాత వాలంటీర్లు, ప్రజలు బారులుతీరి నడిచారు. మొత్తం పూరేగింపులో 2 వేలమంది పాల్గొన్నారు. బెదిరేయెడ్లను సర్దుతూ, ప్రజలను ఉత్సాహపరుస్తూ ఆహ్వానసంఘాధ్యక్షులు వెంకట్రామయ్యగారు ఊరేగింపువెంట నడిచారు. గ్రామ రైతులు తమపూళ్లో యింత ప్రదర్శనం ఎన్నడూ జరగలేదని ఆశ్చర్యాన్ని వెల్లడించారు.

ఊరేగింపు సభా ప్రదేశానికి 7 గంటలకు చేరింది. ఆహ్వానసంఘాధ్యక్షులు ఉపన్యాసకులను, యువజనులను ఆహ్వానించుతూ క్లుప్తంగా మాట్లాడారు. హరిసర్వోత్తమరావుగారు యువజన మహాసభను ప్రారంభించుతూ ఉత్సాహపూరితమైన ఉపన్యాస మిచ్చారు.

'ప్రజారాజ్యం కావాలి'

హరిసర్వోత్తమరావుగారు తమ రాజకీయ జీవితం కృష్ణాజిల్లాలోనే ప్రారంభమయిందని తెలిపారు. 1906 లో రాజమండ్రిలో చదువుకొంటూండగా రాత్రిపాఠశాలను స్థాపించి, 90 మంది బీదయువకులకు చదువుచెప్పడానికి పూనుకున్నామన్నారు. ఇపుడు యువజన సంఘాలు వయోజనవిద్య గరపుచూ అనేక గ్రామాలలో కృషిచేస్తున్నందుకు అభినందించారు. బిపిన్ చంద్రపాల్‌గారి ఉపన్యాసాలు విని 'వందేమాతరం' వుద్యమంలో తామెలా పనిచేసిందీ తెలిపారు. నాటినుండి ఏ వుద్యమంలోచేరినా తమ లక్ష్యం బీదలకు విద్య నేర్పడం, సర్వజనులకు పౌరహక్కులిచ్చే స్వరాజ్యంకోసం కృషిచేయడమే నన్నారు. అబ్రహాం లింకను నిర్వచించినట్లుగా ప్రజలకొరకు పనిచేసే ప్రజారాజ్యం కావాలన్నారు.

మనదేశంలో పరిశ్రమలు అభివృద్ధిచెందకుండా బ్రిటిషుప్రభుత్వం అడ్డుతగులుతూందన్నారు. శాస్త్రజ్ఞానం ఎక్కువకావాలి, పరిశ్రమలు పెంపొందాలి, స్వరాజ్యం కావాలి. కేవలం బ్రిటను, అమెరికాలవలెనే పెట్టుబడిదారీ స్వాతంత్ర్యంవుంటే చాలదన్నారు. కుమ్మరి, కమ్మరి, సాలె వగైరా కర్మకారులకు, రైతులకు-వేయేల-చెమటోడ్చి పనిచేసే వారందరికి, బాధ్యత వహించే ప్రభుత్వం కావాలన్నారు. స్త్రీ పురుషులకు సమాన అవకాశా లుండాలన్నారు. అలాంటి సంపూర్ణ ప్రజాస్వామిక ప్రభుత్వం రష్యాలో వుందన్నారు.

మన తెలుగు దేశానికి ప్రజారాజ్యం కావాలని సర్వోత్తమరావుగారు స్పష్టపరిచారు. "తెలుగుభాషలో రాజ్యాంగ వ్యవహారాలు జరగాలి. తెలుగు ప్రజలకు రాష్ట్రం కావాలి. శాసనసభలో తెలుగుభాష వుండాలి. అపుడే సామాన్య రైతు, కూలి వాటిలో పాల్గొనగల్గుతాడు. ప్రజలు రాజ్యమేలుకోవాలి. అని సర్వోత్తమరావుగారు తమ ఉపన్యాసాన్ని ముగించారు.

తరువాత అధ్యక్షత వహించిన చంద్రశేఖరరావు క్లుప్తంగా ఉపన్యసించారు. హరిసర్వోత్తమరావుగారు 40 యేండ్లుగా ప్రజాసేవ చేసిన అనుభవశాలి. వారి అమూల్యమైన సలహాలను యువకులు అనుసరించాలన్నారు. నేటి యువకులే భావిపౌరులు. దేశభవిష్యత్తు యువజనులమీదేవుంది. యువజన సంఘాలు యువకుల శరీరబలం, విజ్ఞానం, పెంపొందించడానికి ఆటలు, విజ్ఞాన కార్యక్రమం అనుసరించుతున్నాయి. చదువురానివారికి విద్య నేర్పడానికి రాత్రిపాఠశాలలు నడుపబడుతున్నాయి. అనగా సర్వోత్తమరావుగారివంటి పెద్దలు ఏర్పరచిన సుసాంప్రదాయాలను యువజనులు వ్యాప్తిచేస్తున్నారు.

వందేమాతరం వుద్యమంలో రాజకీయాలలో ప్రవేశించిన సర్వోత్తమరావుగారు, ఆంధ్ర జాతీయోద్యమంలోకూడ పనిచేస్తున్నారు. అనగా స్వాతంత్ర్యోద్యమంలో మేల్కొన్న వివిధప్రజలు తమ జాతీయాభివృద్ధికి కృషిచేస్తున్నారు. స్వాతంత్ర్యోద్యమం యొక్క శాఖే ఆంధ్రోద్యమం. మనవలెనే ముస్లిమ్‌జాతుల ప్రజలు, 1920 ఖిలాఫత్ వుద్యమంలో పాల్గొన్నవారే, నేడు తమకు ప్రత్యేక ప్రభుత్వం కావాలని కోరుతున్నారు. దానినే పాకిస్థాన్ అంటున్నారు. ఆంధ్ర జాతీయాభ్యుదయానికి మనం ప్రత్యేకరాష్ట్రం కావాలంటున్నాము. అలాగే ముస్లిముజాతులు కూడ. ఈ సంగతి కాంగ్రెసుసోదరులు గ్రహించితే, హిందూ - ముస్లిం ఐకమత్యం సులభసాధ్యమవుతుందన్నారు. ఆంధ్రభూమి పరిశ్రమలలో, విద్యలో వెనుకబడివుంది. ముందుకు తీసుకుపోవడానికి ప్రజలందరు, యువకులు కృషిచేయాలి. బెజవాడలో ఫ్యాక్టరీ నిర్మించాలనీ గుంటూరులో వైద్యకళాశాల నిర్మించాలనీ, అందుకొరకు యువకులు ఆందోళన చేయాలని కోరుతూ అధ్యక్షుపన్యాసం పూర్తిచేశాడు.

తరువాత కాట్రగడ్డ నారాయణరావు ఎం. యల్. ఏ. గారు ఉపన్యసించారు. యువకుల ఆటలలో కనపరచిన నైపుణ్యం కొనియాడారు. పసిపాటలున్న సమయంలో అవి మాని ఆటలాడరాదని హెచ్చరించారు. కాంగ్రెసు పేరున తప్పుడుప్రచారం చేస్తున్నవారిని ఆక్షేపించారు. అట్టివారు యిప్పటికైనా తమ పొరపాటు తెలిసికొని హిందూ-ముస్లిం ఐక్యత కోసం, హరిజనుల అభ్యుదయం కోసం, కృషి చేయాలని హెచ్చరించారు. ఘంటసాల కాంగ్రెసు ఉద్యమంలో పేరుపొందిన గ్రామమనీ, అలాంటిచోట మహిళా ఉద్యమంలో పనిచేసే సోదరీమణులను నిందించుతూ కొందరు ప్రచారం చేశారనేవార్త విన్నామనీ, అలాంటి పనులు చేసేవారు ఘంటసాల పేరుకే కళంకం తెస్తున్నారన్నారు. అలాంటి పను లికముందు జరుగకుండా ప్రజలు జాగ్రత్తవహించాలని కోరారు.

తరువాత అనారోగ్యంవల్ల సభకు రాజాలకపోయిన కాశీపట్నం కొండయ్యగారు పంపిన సందేశాన్ని చదివి, వినిపించారు. వయోజనవిద్య, గ్రంధాలయాలు పెంపొందించడానికి యువజనులు పూనుకోవాలనీ, సభలు జయప్రదంగా జరగాలనీ కొండయ్యగారు ఆశీర్వదించారు. పిమ్మట ఆటలపోటీలలోను, విజ్ఞాన ప్రదర్శనాలలోను గెలుపొందినవారికి బహుమతులు పంచబడ్డాయి. వందన సమర్పణతో సభలు ముగిశాయి.

(4 వ పేజీ తరువాయి) నిజ పరిస్థితులను వీరేమి తెలుసుకున్నారు? తెలుసుకుంటే, కరువువస్తోందని భయంకలిగించడ మెందుకు? మాగాణి య 1కి రు. 231 లు ఖర్చా? ఇక ఆదాయం సగటున య 1కి రు. 200 లా? మెరకకు య 1కి ఖర్చులు రు. 32 లా? ఆదాయం సగటున రు. 27 లా? ఎందుకు వచ్చిన ప్రకటన లివి! రైతుల దైనందిన కోర్కెలకు ఇవేమైనా సహాయపడుతాయా? సత్యదూరమైన నినాదాలతో వాస్తవిక పరిస్థితులను కప్పిపుచ్చితే రైతాంగానికి నష్టమేగాని లాభంకలుగదు. అన్నిటికంటే ఆశ్చర్యకరమైన విషయమేమంటే "దూదికి కనీసధర నిర్ణయించాల"ని వెంకటసుబ్బయ్యగారు ప్రకటించడం. పాపం దూదికి 1943, 1944 లలో ప్రభుత్వం నిర్ణయించిన కనీసధరల సంగతే యీయనకు తెలియదు!

కాబట్టి రాయలసీమ రైతాంగమంతా వెంకట సుబ్బయ్యగారి అసత్యప్రకటనలను ఖండించాలి. రైతులు తమధాన్యానికి కంట్రోలు ధరలను రాబట్టుకోవడానికి, తరుగుప్రాంతాల ప్రజలకు కంట్రోలు ధరలకు ధాన్యం లభింపజేయడానికీ, ప్రభుత్వమే కంట్రోలు ధరలకు ధాన్యాన్నికొనాలి. తరుగుప్రాంతాల ప్రజలకు వాటినిసరిగా సప్లయిచేయాలి. 1943 లో మిగిలినదూదినీ, ఈ సంవత్సరం పండే దూదినీ కూడాప్రభుత్వమే కంట్రోలు ధరలకు కొనితీరాలి. ఈకోర్కెలకై రాయలసీమరైతాంగం ఆందోళన చేయాలనీ కోరుతున్నాము.

ఇట్లు,

తరిమెల నాగిరెడ్డి,
(జిల్లా రైతుసంఘాధ్యక్షుడు, అనంతపూరు.)

పురిమెట్ల వెంకటరామప్ప,
(జిల్లా రైతుసంఘ కార్యదర్శి, బళ్లారి.)

నంద్యాల వరదారెడ్డి,
(జిల్లా రైతుసంఘ కార్యదర్శి, కడప.)

సి. పుల్లారెడ్డి,
(జిల్లా రైతుసంఘాధ్యక్షుడు, కర్నూలు.)

రైతులకు హెచ్చరిక

కృష్ణాజిల్లాలో క్రొత్తధాన్యాన్ని చాలచోట్ల వర్తకులు కొన ప్రారంభించారు. ఈ సందర్భంలో రైతులు ఒక ముఖ్యవిషయాన్ని జ్ఞప్తియందుంచుకోవాలి. ధాన్యాన్ని అమ్ముకోదలచిన రైతులు, లైసెన్సుఉన్న వర్తకులకు అమ్ముతూ, యేరకపుధాన్యాన్ని, యెంత మొత్తాన్ని తాము విడుదలచేసినదీ వివరాలతోసహా లెక్కలు ఉంచుకోవాలి. దానితోపాటు పై వివరాలన్నింటిని గ్రెయిన్ పర్చేజింగ్ ఆఫీసరుకు వెంటనే రిజిష్టరు పోస్టులో తెలియజేయాలి. ఈవిధంగా చేయకపోతే వర్తకులు ధాన్యాన్ని దొంగమార్కెటులో అమ్ముకొనుటకు అవకాశం కల్పించినవారగుటయేగాక, తాముకూడ కష్టనష్టాలకు గురికావలసివస్తుంది. ఎందువల్లనంటే,ధాన్యం అమ్మిన మరో రోజునే గ్రెయిన్‌పర్చేజింగ్ ఆఫీసరువచ్చి మరలధాన్యాన్నిడిమాండుచేయవచ్చు. లోగడ కొన్నిచోట్ల ఇదేవిధంగా జరుగుట, రైతులు కష్టాలకుపాల్పడుట సంభవించింది.అందుచే రైతులు ముందే తగుజాగ్రత్త వహించాలి.

ఇట్లు,

బెజవాడ 10-12-44 } కాట్రగడ్డ రాజగోపాలరావు,
కార్యదర్శి,
కృష్ణాజిల్లా రైతుసంఘం.

★

సవరణలు

క్రిందటి పంచిక 7 వ పేజీలో "వ్యాయామ ప్రవీణ దండమూడి రాజగోపాలంగారి యోగ, ఆసన ప్రదర్శనాలు ఎంతో ఉత్సాహాన్ని కల్గించాయి." అని వుంది. అది పొరబాటు, రాజగోపాలంగారు మహాసభకు రాలేదు. పై వాక్యానికి బదులు "రాజారావుగారు విలువిద్య ప్రదర్శించారు." అనే వాక్యం చేర్చి చదువ కొనవలెను.

ఆ సంచికలోనే 6 వ పేజీలో కర్నూలు జిల్లాలో జరిగిన "ఐక్యతావార" సభలు 10 కి బదులు 45 అనీ, హాజరైన ప్రజలు 5,000 కి బదులు 7,000 అనీ ఉండాల్సించి.

ప్రజాశక్తి
★
భారత కమ్యూనిస్టు పార్టీ
ఆంధ్రకమిటీ పత్రిక
★
సంపాదకవర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు (సం)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

చర్చిల్ కు పొయ్యేకాలం వచ్చింది!

గ్రీసులో సంక్షోభానికి మూలం ఎవరు?

— తుమ్మల వెంకటరామయ్య

ప్రాచీన సంస్కృతికి పుట్టినిల్లు గ్రీసు. సుప్రసిద్ధ చారిత్రకనగరం ఏథెన్సు ఆ గ్రీసుకు రాజధాని. ఆ యేథెన్సులో ప్రాచీనకళాసంశోభిత పవిత్రాలయాల ముందు, గ్రీసు దేశభక్తుల కళేబరాలు రక్తపు మడుగులలో దొర్లుతున్నాయి. ఇందుకు బాధ్యులెవరు? ఫేసిస్టు హంతకులైన ముసోలినీ మూకలా? నాజీ కిరాతకులైన హిట్లరు సైన్యాలా? కాదు. గ్రీసు ప్రధాని పపాండ్రియో, అతనికి సహాయపడుతూన్న బ్రిటిషు సర్వసేనాని స్కోబీ, వీరిద్దరినీ సిగ్గువిడచి సమర్థిస్తున్న చర్చిల్— వీరిదే బాధ్యత అంతా.

గ్రీసులోని ఈ సంక్షోభానికి మూలం ఏమిటి? యుద్ధానికి పూర్వం జనరల్ మెటాక్సస్, జార్జిరాజు, వీరిద్దరి నియంతృత్వం క్రింద గ్రీసు నలిగిపోయింది. ఆ తర్వాత ముసోలినీ మూకలు, ఆపై నాజీ కిరాతకులు గ్రీసును రక్తపుచేరులలో ముంచారు. రాజూ, అతని ప్రభుత్వవర్గమూ లండన్ పోయి, హోటళ్ళలో త్రాగి తందనాలాడే సమయంలో, గ్రీకు ప్రజలు అప్రతిమాన సాహసాలు చూపి, తమ రక్తాన్ని ధారపోసి, తమప్రాణాలొడ్డి, తమ మాతృదేశాన్ని విముక్తి గావించుకొన్నారు.

గ్రీసుప్రజలందరూ రాజు తిరిగి తమదేశం రాకూడదన్నారు. ప్రజలెన్నుకొనే ప్రభుత్వం వచ్చేవరకు ఒకసంయుక్త ప్రభుత్వం పని చేయాలని, వివిధపక్షాలు అంగీకరించాయి. లెబనాన్‌లో గత వేసవి ఒక ఒడంబడిక జరిగింది. దానిప్రకారం "పపాండ్రియో" ప్రధాని అయ్యాడు. ప్రతిఘటనా ఉద్యమం తరపున ఎనిమిదిమంది మంత్రులను పపాండ్రియో తీసుకొన్నాడు.

ప్రతిఘటనా ఉద్యమానికి "ఇ. ఎ. యం" అనిపేరు. వీరి సైనికులకు "యల్.ఎ.ఎస్." (ఎలాస్) అనిపేరు. ఈ ఉద్యమంలో సోషలిస్టులు; పాప్యులర్ డిమాక్రేట్‌లు; కమ్యూనిస్టులు; అగ్రేరియన్‌పార్టీ; అతివాద లిబరల్సు ఉన్నారు. నిజానికి దేశహితాభిలాషులందరూ దీనిలో ఉన్నారు.

ఎన్నడో, జూలై 29 వ తేదీననే బ్రిటిషు పత్రిక న్యూస్‌క్రానికల్ "లెబనాన్‌కు వచ్చిన ప్రతిఘటనా ఉద్యమ ప్రతినిధులు చిత్తశుద్ధి గల నిజాయితీ మనుష్యులు. నిజమైన సంయుక్త ప్రభుత్వం కోసం వారు తమ కోర్కెలను అనేకంవదలు కొన్నారు. కాని పపాండ్రియో వారిని మోసగించాడు. తనకు బ్రిటిష్ సపోర్టున్నదని అతనిధీమా" అని వ్రాసింది.

కాని డిశంబరు 1 వ తేదీన ప్రధాని ఒక ప్రకటన చేశాడు. ఇక ముందునుంచి పౌర శాంతిని 1936లో ఏర్పడిన "నేషనల్ మిలీషియా గార్డు" కాపాడుతుంది అన్నాడు. ఈ పోలీసుదళం, యుద్ధానికి పూర్వం జనరల్ మెటాక్సస్ నిరంకుశత్వంక్రింద, యుద్ధకాలంలో జర్మన్లక్రింద పనిచేసింది. దానికి ప్రతిఘటనా ఉద్యమ నాయకులు అసమ్మతి తెలియచేశారు. ఆ రాత్రే, ప్రతిఘటనా ఉద్యమంలోని సైనికులందరూ 10వ తేదీలోగా తమఆయుధాలిచ్చివేయాలని మరొక ఉత్తర్విచ్చారు. ఈ ఉత్తరువు ప్యాస్‌చేసినపుడు ప్రతిఘటనా ఉద్యమమంత్రులను పిలవలేదు. ఇంతేగాదు. "మోంటెన్ బ్రిగేడ్, సేక్రెడ్ బెటాలియన్" మొదలైన ఫాసిస్టు అనుకూల దళాలను నిరాయుధులను చేయడానికి వ్యతిరేకించాడు. పపాండ్రియో తరపున జోక్యం కలిగించుకొంటూ, నిరంకుశంగా ప్రవర్తించిన జనరల్ స్కోబీ (గ్రీసులో బ్రిటిష్ సర్వసేనాని) నిరంకుశంగా నిర్ణయాలను తీసికొన్నందుకు కమ్యూనిస్టునూ, వ్యవసాయ మంత్రియు నైన జాన్ జెవ్‌గాస్ తీవ్రంగా ఖండించాడు. ఆ రాత్రియే ప్రతిఘటనా ఉద్యమ మంత్రులంతా రాజీనామా నిచ్చారు.

ఏ దేశభక్తులు తమ మాతృదేశానికి చెర విడిపించారో, వారిని నిరాయుధుల జేయడం! ఏ ద్రోహులు శత్రువులకు కుక్కలలా పని చేశారో వారిని సాయుధులను జేయడం! గ్రీకు ప్రజలు సహించలేకపోయారు. 3 వ తేదీ ఆదివారం బ్రహ్మాండమైన ప్రదర్శనం జరిపారు. ప్రదర్శనంలో వారిచేతులలోవున్న దేమిటి? ఆయుధాలా? కాదే. మిత్రమండలి పతాకాలు. సోవియటు, అమెరికన్, బ్రిటిష్, గ్రీసు పతాకాలను ఎగురవేశారు. స్త్రీలు, పిల్లలుకూడ పదర్శనంలోపాల్గొన్నారు. కాని పపాండ్రియో దృష్టిలో, బ్రిటిష్ సామ్రాజ్యవాదులదృష్టిలో, ఇది "తిరుగుబాటు". చర్చిల్ దృష్టిలో "అల్లరిమూకలు." కరుడుగట్టిన టోరీముఠాకు చెందిన టైమ్సుపత్రికా విలేఖరి సైతం శాంతియుతంగావెళ్లే ఈ దేశభక్తులపై కాల్పులకు కంపించిపోయాడు. "ప్రదర్శనలో పాల్గొన్నవారు ఏ మాత్రమూ రెచ్చకొట్టలేదు. దాదాపు ఒకగంట వారిపై క్రూరంగా కాల్పులు జరిగాయి. స్త్రీలు - పిల్లలు సైతం ఆ కాల్పులకు గురి అయ్యారు." అని వ్రాశాడు.

మరుసటిదినం, దేశభక్తులు మరణించిన చోట కొయ్యశిలువలను పూలమాలలను పెట్టారు. 15 వేలమంది బ్రిటిషు రాయబారి కార్యాలయంముందు ప్రదర్శనం చేస్తూ "బ్రిటిషు సైనికులారా! మా ప్రభుత్వాన్ని మమ్మల్నే ఎన్నుకోనీయండి" అని నినాదాలిచ్చారు.

కాల్పుల కసమ్మతిగా ఒక్కరోజు సమ్మె జరుప నిశ్చయించారు దేశభక్తులు. ఇంతలో బ్రిటిష్ సేనాని స్కోబీ, పపాండ్రియో తరఫున నిలిచి, అంతర్యుద్ధాన్ని రెచ్చగొట్టాడు. పపాండ్రియో రాజీనామాయివ్వ సిద్ధమయ్యాడు. 80 యేండ్ల వృద్ధుడూ, లిబరల్ నాయకుడూ ఐన సోఫొలిస్ సంయుక్త మంత్రివర్గం ఏర్పరచ సిద్ధమయ్యాడు. కాని స్కోబీ "పపాండ్రియోను బలపరచాలి" అని ఆజ్ఞాపించాడు. దానికి సమాధానంగా ఆ ముసలి లిబరల్ నాయకుడు "పపాండ్రియోను సపోర్టుచేయడం నిరంకుశత్వాన్ని సపోర్టుచేయడం" అన్నాడు.

బలవంతాన, గ్రీసు దేశభక్తులపై అంతర్యుద్ధం నెత్తినరుద్దబడింది. బ్రిటిషు టాంకులు, విమానాలు, శతఘ్నులు గ్రీసు దేశభక్తులపై ప్రయోగింపబడుతున్నాయి. ఈ పరిస్థితికి చింతించని వారెవ్వరు?

బ్రిటిషు జోక్యాన్ని విమర్శించని పత్రిక లేదు. టైమ్సుపత్రిక కూడ బ్రిటిషు ప్రభుత్వ చర్యను ఖండించిందంటే, పరిస్థితు లెంత విషమించాయో చెప్పనక్కరలేదు. చర్చిల్ తన చర్యలను సమర్థించుకొంటూ రెండు ఉపన్యాసాలు గావించాడు. మొదటి ఉపన్యాసాన్ని తీవ్రంగా ఖండించుతూ డైలీవర్కర్ ఇలా వ్రాసింది.

"గ్రీసులో బ్రిటిష్ ప్రభుత్వం అవలంబించిన వైఖరిని చర్చిల్ సమర్థించుకుంటున్నారు. కాని ఇంతకన్నా సిగ్గుమాలినపని మరొకటి లేదు. చర్చిల్ నిజాన్నితప్పి ఎన్నోఅబద్ధాలు ఆడాడు. అతడవలంబించిన వైఖరిని బ్రిటిషు జాతి ఎన్నడూ బలపరచదు. గ్రీకు ప్రజాబాహుళ్య అభీష్టానికి విరుద్ధంగా కొద్దిమంది అభివృద్ధినిరోధకుల నిరంకుశ ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి, బ్రిటిష్ సేన లుపయోగించబడుతున్నాయి. దానిని చర్చిల్ బలపరచుతున్నాడు. నిరసనసమ్మె జయప్రదంగా సర్వత్రాజరగడం, పపాండ్రియో రాజీనామా నివ్వడం,అతనిక్రింది ఉద్యోగులుకూడఅతనిని ఆఫీసులోకి రానీయకపోవడం, ఇదంతా ఏమి తెలియజేస్తుంది? పపాండ్రియోకున్న బలమెంత తక్కువో ఇవి తెలియజేస్తున్నాయి.

మొన్న కామన్సు సభలో చర్చిల్ గ్రీకు దేశభక్తులను "మూకలనీ" "గుంపులనీ" "దోపిడీ గాండ్ర"నీ "కమ్యూనిస్టు నియంతృత్వం" నెలకొల్ప జూస్తున్నారనీ ఇష్టం వచ్చినట్లు పేలాడు. అన్నిటికన్న పపాండ్రియో ప్రభుత్వం శాసనబద్ధ ప్రభుత్వం అనడం విచిత్రం. 1936 లో ఎన్నడో గ్రీసులో నియంతృత్వం ఏర్పడి, శాసనసభలన్నీ ఎగిరిపోయాయి. ఒక్క గ్రీస్‌లోనేగాక బెల్జియంలోఇటలీలోతామవలంబించుతున్న చర్యలను సమర్థించుకుంటూ "పూర్వం కమ్యూనిస్టు విప్లవం రాకండా" ముసోలినీని సమర్థించినమాట నిజమేననితెగబడిచర్చిల్‌చెబుతున్నాడు. ఈవైఖరిసరియైనది కాకపోతే తనను ప్రధాని పదవినుండి పీకదెరకండంటూ బెదరించాడు. ఈబెదరింపువల్ల కామన్సుసభలో అతనికి వోట్లువచ్చిన మాట నిజమే. లేబర్‌పార్టీ వోటుచేయకండా మానుకుంది. ఇదంతా చర్చిల్ తన విజయం అనుకుంటే అది చాలా దుర్బ్రమయే.

అట్లాంటిక్ చార్టర్‌ను, టెహరాన్ నిర్ణయాలను ఉల్లంఘించుతూ, చర్చిల్ చేసే ప్రకటనలు, అవసానదశలో ఉన్న హిట్లరును తప్ప మరెవ్వరినీ సంతోషపెట్టలేవు. అప్పుడే బ్రిటిషు ప్రజాభిప్రాయం, అమెరికన్ ప్రజల, ప్రభుత్వ అభిప్రాయాలు వ్యతిరేకమయ్యాయి. చర్చిల్ వైఖరిని సోవియటు హర్షించదని వేరే చెప్పనక్కరలేదు. చర్చిల్‌కు పొయ్యేకాలం వచ్చింది. అందుకే యీ వైఖరి.

కాని దేశభక్తుల స్వాతంత్ర్యాన్ని అరికట్టడానికి చర్చిల్ తరంకాదు. హిట్లర్ నోడించి సంపాదించుకున్న స్వాతంత్ర్యాన్ని చర్చిల్ ఊడబెరకలేడు. మిహిలోవిచ్‌కి (యుగోస్లావియాలో) డార్లాన్‌కు (ఫ్రాంసులో), బడోలియోకు (ఇటలీలో), ఏగతిపట్టిందో, అదే గతి పపాండ్రియోకు కూడ పడుతుంది.

(మొదటిపేజీ తరువాయి) ఈనాడు కృష్ణ, గుంటూరు ఉభయగోదావరులలో కాంగ్రెసు బలంగా వున్నదంటే, అందుకు రైతుసంఘాలు, రైతువర్కర్లు గత 7, 8 సంవత్సరాలలో ఎంత కృషిజేశారో గమనించండి. ఇట్టి రైతువుద్యమంయొక్క ఐక్యతను దెబ్బకొట్టు ప్రయత్నాలనుండి విరమించమని కాశేశ్వరరావుగారు మొదలగు వారిని కోరుచున్నాము.

రంగాగారు యింకో అడుగు ముందుకెళ్ళారు. కాంగ్రెసులో సభ్యులుగా వున్నవారే రైతుసంఘములో సభ్యులుగా వుండాలట. రంగాగారు రాజకీయాలలో పల్టీలమీద పల్టీలు కొడుతూ వుంటారు. లోగడ వీరు రైతుసంఘాలు స్వతంత్ర వర్గ సంఘాలుగా వుండాలని వాదించినవారిలో ముఖ్యులు. అఖిలభారత కిసాన్‌సభ కమ్యూనిస్టుల ప్రాబల్యంక్రిందికి పోవుటచేతనే తాము అందునుండి విడిపోయామని వీరిమువా వారు నిన్న మొన్నటివరకూ విషప్రచారం చేశారు. కాని ఈనాడు ఇదంతా మర్చిపోయి, రంగాగారు రైతుసంఘాన్ని కాంగ్రెసులో ఒక ఉపశాఖగా నిర్మించదలస్తున్నారు. "కాంగ్రెసులో భాగంగా వుండాలంటే, ఇంక రైతుసంఘాలెందుకు" అన్న నెహ్రూగారి వాక్యాలను రంగాగారు ఒక్కపరి గుర్తుకుతెచ్చుకో గోరుచున్నాము. "కిసాన్‌కాంగ్రెసు"ను నిర్మించి, స్వంతనాయకత్వాన్ని ఏర్పర్చుకొని, నేషనల్ కాంగ్రెసు వెనుక ఘట్టిగా నిలబడాలి" అన్న సాకుతో తమ నాయకత్వాన్ని నిలబెట్టుకొనుటకై కాంగ్రెసుశాఖగా రైతుసంఘాలనేర్పరచి, కాంగ్రెసువాదులను భ్రమపుచ్చుట తగదు.

కాంగ్రెసుకు శాఖగా రైతుసంఘాలను పెట్టుటకు కారణాలముజూపుతూ "స్వాతంత్ర్య పోరాటానికి బలమును చేకూర్చుటకూ, కాంగ్రెసును వెనుకపోటు పొడువకుండా వుండుటకు" అన్నసాకును జూపుతున్నారు. స్వాతంత్ర్య పోరాటాన్ని బలపర్చకుండా వుండటాన్నిగాని, కాంగ్రెసును వెనుక నుండి పొడవటానికిగాని, ఏ రైతుసంఘమైనా, ఎన్నడైనా, ప్రయత్నించిందేమో రుజువుచేయమని రంగాగారిని సవాలు చేస్తున్నాము. ఆగస్టు సంఘటనలు కాంగ్రెసు ప్రారంభించిన జాతీయ విప్లవోద్యమమంటూ రంగాముఠావారు ప్రచారం చేశారు. ఇప్పటికీ ఆగస్టు సంఘటనలనే కాంగ్రెసు పోరాటమని రంగాగారు ప్రజలను నమ్మించ బూనుకొన్నచో, గాంధీజీ స్టేటుమెంటు, కాంగ్రెసు అధ్యక్షుని స్టేటుమెంటు, అబద్ధములని వీరు అంటున్నారన్న మాట!

కాంగ్రెసు దేశభక్తులందరికీ ఒక విజ్ఞాపన, కాంగ్రెసును బలపర్చే ఉద్దేశంతో రైతువుద్యమాన్ని విచ్ఛిన్నంచేయు ప్రయత్నాలను మానండి. ఏ యెండ కా గొడుగు పట్టేవారి కుతంత్రాలకు మోసపోకండి. రైతువుద్యమాభివృద్ధిద్వారానేఆంధ్రలోజాతీయోద్యమాభివృద్ధిని గావించగలమను పూర్వానుభవాన్ని గుర్తించండి. అందులకై ఐక్యరైతువుద్యమాన్ని నిర్మించుటకై, దానిని మరింత ముందుకు తీసికొనిపోవుటకై తోడ్పడండి. రైతుసేవ చేయగలమనుకొన్న వారందరూ ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంలోజేరండి. దానిని బలపర్చండి.

ఆంధ్ర రైతాంగమున కొక హెచ్చరిక చేస్తున్నాం. నేడు దేశంలోనూ, దేశభక్తులలోనూ ఏర్పడిన నిరాశ, నిస్పృహాభావాలవల్ల కొందరు తప్పు నిర్మాణ పద్ధతులను అవలంబిస్తున్నారు. లోగడ రైతువుద్యమ విచ్ఛిన్నకారులైన కొందరు వీరిని పెడమార్గాం

(4 వ కాలం తరువాయి)

బెట్టిస్తున్నారు. ఇందువల్ల ఇంతకాలం మనం పెంచి, పోషించి, విస్తృతపర్చిన రైతువుద్యమం విచ్ఛిన్నం కాగలదు. కాబట్టి ఇట్టి ప్రయత్నాలనుండి వారిని మరలించుటకూ, పోటీరైతుసంఘాల నిర్మాణమును ఎదుర్కొనుటకూ, జాగరూకత వహించవలసినదిగా కోరుచున్నాము.

కడియాల గోపాలరావు,
నండూరి ప్రసాదరావు,
చలసాని వాసుదేవరావు.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE